క్లుప్తంగా

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఓపెన్ షటిల్ టోర్నమెంట్‌కు ఆహ్వానం

పరవాడ: వాడచీపురుపల్లి గ్రామంలో శ్రీ రామచంద్రమ్మ పండగను పురస్కరించుకొని ఈ నెల 25న ఓపెన్ షటిల్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు రామచంద్రమ్మ ఉత్సవ కమిటీ చైర్మన్ మాసవరపు అప్పలనాయుడు చెప్పారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.12 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.8 వేలు, నాలుగో బహుమతిగా రూ.6వేల నగదు అందజేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఈ నెల 24 సాయంత్రం లోగా రూ.200 చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు 9052129291, 9493424345 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

వెంకన్నకు తోమాల సేవ



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, అష్టోత్తరం, దూపసేవ నిర్వహించారు. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు.

తూర్పు కాపులకు సామాజిక న్యాయం కల్పించాలి



ఐక్యత చాటుతున్న ఉత్తరాంధ్ర తూర్పు కాపు సంఘం ప్రతినిధులు

మద్దిలపాలెం : ఉత్తరాంధ్ర తూర్పు కాపులకు రాజకీయ ప్రాధాన్యతతో పాటు, సామాజిక న్యాయం కల్పించాలని ఉత్తరాంధ్ర తూర్పు కాపు సంఘం డిమాండ్‌చేసింది. దీనికి సంబంధించి శనివారం పిఠాపురం కాలనీలో సంఘం ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు మాట్లాడుతూ తూర్పు కాపులకు కాకుండా పలు పార్టీలు కాపు కులస్తులకు సీట్లు కల్పిస్తున్నాయన్నారు. దీంతో తూర్పు కాపు సామాజిక వర్గం రాజకీయ ప్రాధాన్యత కోల్పోతుందన్నారు. ఇప్పటికే విశాఖ ఎంపీ సీటు వైఎస్సార్‌సీపీ తూర్పు కాపు కులస్తులకు కేటాయించిందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని మిగిలిన పార్టీలు ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలన్నారు. ఉత్తరాంధ్ర తూర్పు కాపు సంఘం గౌరవ అధ్యక్షుడు లంక మోహనరావు మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలో అత్యధికంగా తూర్పు కాపులు భీమిలి, చోడవరం, అనకాపల్లి, విశాఖ పశ్చిమ, గాజువాక, విశాఖ తూర్పు నియోజకవర్గాల్లో ఉన్నారన్నారు. తూర్పు కాపులకు ప్రత్యేకంగా సీట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి లోగిశ గణేష్, సుధాకర్, రెడ్డి వెంకటరమణ, గోపి, అసిరి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళా వికాసానికి సీఎం పెద్దపీట

- వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం
- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- అట్టహాసంగా వైఎస్సార్ ఆసరా సంబరాలు



సీఎంవైఎస్ జగన్ చిత్రపటానికి లబ్ధిదారులతో కలిసి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



లబ్ధిదారులకు ఆసరా జంబో చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



సమావేశానికి హాజరైన డ్వాక్రా మహిళలు

సబ్బవరం:మహిళల మోములో చిరునవ్వు చూసే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన 4వ విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ మహిళలు స్వయం సమృద్ధి సాధించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దీని కోసం మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అందజేస్తుందని చెప్పారు.

మాటమీద నిలబడే నేత జగన్

చేయని మాటలు చెప్పడం, అమలు కాని హామీలు ఇవ్వడం సీఎం వైఎస్ జగన్‌కు తెలియదన్నారు. ప్రతి ఒక్కరూ ఈ ప్రభుత్వంలో ఏదో ఒక పథకం ద్వారా పార్టీలకు అతీతంగా లబ్ధిపొందారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదిస్తే మరింత మంచి పాలన అందిస్తారన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్యం చేయించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్ల దగ్గర నుంచి అనేక రకాల ప్రభుత్వ సేవలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. సీఎం వైఎస్ జగన్ సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చి వలంటీర్ల ద్వారా ప్రజల ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు సేవలను అందిస్తున్నారు. అటువంటి వలంటీర్లను చంద్రబాబు జైల్లో పెడతామని బెదిరించడం దుర్మార్గమన్నారు. మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి వలంటీర్లను గజదొంగలతో పోల్చడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. వచ్చే ఎన్నికల్లో తమను దీవించాలని కోరారు.

జంబో చెక్ అందజేత

4వ విడత వైఎస్సార్ ఆసరాలో భాగంగా మండలంలోని 14,873 మంది డ్వాక్రా మహిళలకు రూ.13.53 కోట్ల జంబో చెక్కు అందజేశారు. దీంతో నియోజకవర్గం పరిధిలో 4వ విడతల్లో రూ.225.5 కోట్లు డ్వాక్రా మహిళల ఖాతాల్లో నేరుగా జమ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కర్రి బాబు, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు,మాజీ జెడ్పీటీసీ కొటాన రాము, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,సబ్బవరపు నారాయణమూర్తి, కాపుశెట్టి శేషుబాబు,రాపేటి రాము,ఐడీబాబు,అప్పలరాజు పాల్గొన్నారు.

మహిళలకు సముచిత స్థానం



ప్రతి మహిళా గౌరవంగా తలెత్తుకొని జీవించే విధంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందిస్తుంది.ప్రతి చిన్న విషయానికి కుటుంబ సభ్యులపై ఆధారపడకుండా కుటుంబాన్ని ముందుకు నడిపించే విధంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆసరాగా నిలుస్తున్నారు. మాకు రుణ మాఫీ,వైఎస్సార్ ఆసరా, ఇంటి స్థలం అందించారు. అన్ని విధాలుగా మహిళలకు చేయూత అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు.

-వి. సావిత్రి,తవ్వవానిపాలెం.

రూ. 38 వేలు లబ్ధి



మాది మండలంలోని నల్లరేగులపాలెం. 19 సంవత్సరాలుగా ఈ గ్రూపులో సభ్యురాలిగా కొనసాగుతున్నాను. వైఎస్సార్ ఆసరా ద్వారా 4వ విడత రూ.9,500 రుణమాఫీ వచ్చింది.దీనితో నాలుగు విడతల్లో కలిపి రూ.38 వేలు నాకు రుణమాఫీగా వచ్చింది.దీంతో పాటు అమ్మఒడి వంటి సంక్షేమ పథకాలు అందుతున్నాయి. ప్రభుత్వం అందిస్తున్న ఈ చేయూత ఆర్థిక భరోసాకల్పించింది.

-రాజాన కృష్ణవేణి,ద్వారకామయి ఎస్‌హెచ్‌జీ,నల్లరేగులపాలెం

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



జగనన్న ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసింది. వైఎస్సార్ ఆసరా కింద 4 విడతల్లో ఒక్కో మహిళకు సుమారు రూ.80 వేల వరకూ లబ్ధిచేకూరింది. దీంతో పాటు అదే మహిళకు 45 నుంచి 60 ఏళ్ల లోపు ఉంటే సంవత్సరానికి రూ.18,500 చొప్పున అందజేసింది. జగనన్న ఇచ్చిన హామీ మేరకు మా వీవోఏలకు రూ.8 వేల చొప్పు జీతం ఇస్తున్నారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

-కనకమహాలక్ష్మి,సబ్బవరం వీవోఏ

భయం.. భయం



శిథిలావస్థకు చేరిన స్వయంభూవరం తుపాను షెల్టర్

పరవాడ: మండలంలోని తీరప్రాంతాల్లో నిర్మించిన తుపాను భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఎప్పుడు కూలుతాయో తెలియని స్థితిలో ప్రజలను భయపెడుతున్నాయి. మండల పరిధిలో కలపాక శివారు స్వయంభూవరం, వాడచీపురుపల్లి శివారు దలాయిపాలెం, వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, వెంకటపతిపాలెం వంటి లోతట్టు గ్రామాల్లో విపత్తుల సమయంలో ప్రజలకు ఆశ్రయం కల్పించడానికి 40 ఏళ్ల కిందట తుపాను షెల్టర్లు నిర్మించారు. ఏళ్ల తరబడి వాటి ఆలనా పాలన చూడని కారణంగా ఆ భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఏ క్షణాన కూలుతాయోనని అక్కడ నివసిస్తున్న ప్రజలు నిత్యం బితుకుబితుకుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

- స్వయంభూవరం తుపాను భవనం చుట్టూ గోడలు మెట్లు కూలిపోయాయి. పిల్లర్లు దెబ్బతిన్నాయి. ఆ శిథిల భవనాన్ని స్థానికులు పశువుల కొట్టంగా ఉపయోగిస్తున్నారు.
- దలాయిపాలెంలో ఇళ్ల మధ్యలో నిర్మించిన తుపాను భవనం కూడా శిథిలావస్థకు చేరింది. భవనం తోస్తే పడిపోయే స్థితిలో ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- వాడచీపురుపల్లిలో నిర్మించిన తుపాను షెల్టరు కూడా పాడైంది. భవనాన్ని కొంత కాలం అంగన్‌వాడీ కేంద్రంగా ఉపయోగించారు. మరమ్మతులు నిర్వహించని కారణంగా శిథిల స్థితికి చేరింది.
- వెంకటపతిపాలెంలో ఏర్పాటు చేసిన తుపాను షెల్టరు శ్లాబు పూర్తిగా కూలిపోయింది. గోడలు మాత్రమే మిగిలి ఉన్నాయి.

'సింహాద్రి'లో ఎంవోసీ నాగరాజు



యాష్ పాండ్‌ను సందర్శించిన అడిషినల్ సెక్రటరీ నాగరాజు, అధికారులు

పరవాడ : పరవాడ సమీపంలోని సింహాద్రి ఎన్టీపీసీని భారత ప్రభుత్వ అడిషినల్ సెక్రటరీ(ఎంవోసీ) నాగరాజు శనివారం సందర్శించారు. సముద్రిక అతిథి గృహం వద్ద నాగరాజుకు సంస్థ ఓ అండ్‌ఎం జీఎం డీపీ పాత్ర, టెక్నికల్ సర్వీసెస్ జీఎం పద్మప్రియ స్వాగతం పలికారు. సందర్శనలో భాగంగా తొలుత సంస్థకు చెందిన మోడల్ ప్లాంటు, మెయిన్ ప్లాంటు కంట్రోల్ రూం, యాష్ డేక్ ఏరియా, వ్యాగన్ టింప్లర్ ఏరియా, ఫ్లోటింగ్ సోలార్ ప్లాంటు, సీవాటర్ పంప్ హౌస్‌లను సందర్శించారు. ప్లాంటు పనితీరును అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో సంస్థకు చెందిన ఆపరేషన్ జీఎం టి.రాజగోపాలన్, ఫైనాన్స్ జీఎం కె.జె.రావు, హెచ్‌ఆర్ హెడ్ బి.బి.పాత్ర పాల్గొన్నారు.

కార్మికుల పోరాటానికి కేంద్రం దిగిరాక తప్పదు



దీక్షలో పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం : ఉక్కు కార్మికుల పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారం 1101వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మేస్తామని పదే పదే ప్రకటనలు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరారు. పోరాటం చేయడం ఇక్కడి ప్రజలకు, ఉక్కు కార్మికులకు కొత్తేమీ కాదని, కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల రక్షణకు చర్యలు



సదస్సులో మాట్లాడుతున్న శ్రీలక్ష్మి

అక్కిరెడ్డిపాలెం: పనిచేసే ప్రదేశాల్లో మహిళా ఉద్యోగులు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులు, దాడులపై లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం సదస్సు నిర్వహించారు. గాజువాక కోర్టులో 3వ ఏసీఎం ఎం.రాజేంద్రబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో 9 మందికి మించి ఉన్న మహిళా ఉద్యోగుల్లో ఒకరి వద్ద నుంచి ఫిర్యాదును నమోదు చేసి విచారిస్తామని తెలిపారు. 9 మంది లోపు ఉద్యోగినులు ఉన్న కార్యాలయాల్లో కలెక్టర్ ఒక ప్రతినిధిని నియమించి విచారిస్తారన్నారు. తప్పుడు ఫిర్యాదులు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో 8 ఎంఎంసీ వై.శ్రీలక్ష్మి, ఏసీపీ త్రినాథ్, బీవీఎం కృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సింహగిరిపై త్వరలో సహస్రదీపాలంకరణ సేవ

- రూ.10లక్షలతో కేంద్రం ఏర్పాటు
- భూమి పూజ చేసిన దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు, వైదికులు



భూమి పూజ నిర్వహిస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యులు

సింహాచలం : సింహగిరిపై త్వరలో సహస్రదీపాలంకరణ సేవను పునరుద్ధరించనున్నారు. ప్రత్యేకంగా రూ.10లక్షలతో కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈమేరకు శనివారం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు, వైదికులు, అధికారులు భూమి పూజ నిర్వహించారు. అలాగే స్వామివారి తిరువీధి వాహనాలు ఉంచేందుకు మరో రూ.10లక్షలతో వాహనశాల ఏర్పాటు పనులకు కూడా భూమి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా ట్రస్ట్‌బోర్డు సభ్యులు మాట్లాడుతూ సింహగిరికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి పనులతో పాటు, స్వామి సేవలకు సంబంధించిన పనులకు చేపట్టనున్నామన్నారు. గతంలో ప్రతీ శనివారం సాయంత్రం ఆలయ ఆస్థానమండపంలో సహస్ర దీపాలంకరణ సేవ ఉండేదని గుర్తుచేశారు. ఆసేవను మరింత వైభవంగా నిర్వహించేందుగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దాతల సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామని తెలిపారు. త్వరలోనే రూ.54 కోట్లతో ప్రసాద్ స్కీమ్ పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. అలాగే శ్రీనివాసనగర్‌లో దేవస్థానం నిర్మించిన కల్యాణ మండపాలను కూడా త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, సువ్వాడ శ్రీదేవి, దేవస్థానం ప్రధాన పురోహితులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, స్థానాచార్యులు టీపీ రాజగోపాల్, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవో నరసింగరావు, పీఆర్‌వో నాయుడు పేర్కొన్నారు.

రిజర్వేషన్ కోసమే ఆత్మగౌరవ యాత్ర

అక్కిరెడ్డిపాలెం: ఉత్తరాంధ్ర తెలగ జాతి ఆత్మ గౌరవ యాత్ర జీవీఎంసీ 68వ వార్డు మిందిగ్రామానికి శనివారం చేరుకుంది. మింది జిల్లా పరిషత్ పాఠశాల ఎదురుగా గల మాజీ మంత్రి స్వర్గీయ గుడివాడ గురునాథరావు విగ్రహానికి ఉత్తరాంధ్ర తెలగ సంఘం నాయకుడు పల్లంట్ల వెంకట రామారావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర తెలగ జాతి ఆత్మ గౌరవ యాత్ర బీసీ రిజర్వేషన్ సాధన కోసం దృఢ సంకల్పంతో చేపట్టామన్నారు. ఉత్తరాంధలో తెలగ కులస్తులను బీసీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు.

అప్పన్న పాలెంలో అగ్నిప్రమాదం

- పూరిల్లు దగ్ధం
- రూ.ఆరు లక్షల నగదు, ఆరు తులాల బంగారం అగ్నికి ఆహుతి
- నిరాశ్రయులుగా మారిన బాధితులు



మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది



కాలిపోయిన బీరువా



బాధితులు పైడమ్మ, భారతి

సింహాచలం: అగ్నిప్రమాదంలో పూర్తిల్లు అగ్నికి ఆహుతై ఓ కుటుంబం రోడ్డున పడింది. జీవీఎంసీ 98వవార్డు పరిధి అప్పన్నపాలెంలో జరిగిన అగ్ని ప్రమాదం వివరాలు.. అప్పన్నపాలెంలో బొట్ట పైడమ్మ కూతురు భారతితో కలిసి పూరింట్లో ఉంటోంది. ఈ నెల 14న కుమార్తెకు వివాహం చేసింది. వివాహానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కోసం శనివారం మధ్యాహ్నం 12గంటల సమయంలో అల్లుడు, కూతురుతో కలిసి సింహాచలం వెళ్లింది. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి ఇంట్లో మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు ఫైర్ అధికారులతో పాటు పైడమ్మకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బరి మంటలను అదుపుచేసినా ఫలితం లేకపోయింది. మొత్తం ఇంట్లోని సామగ్రి, సారె కోసం బీరువాలో ఉంచిన ఆరు లక్షల నగదు, వివాహం నిమిత్తం సిద్ధం చేసిన ఆరు తులాల బంగారం, బట్టలు, ఎలక్ట్రానిక్ వస్తువులు అన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. కట్టుబట్టలతో బాధితులు నిరాశ్రయులుగా మారారు. సచివాలయ సిబ్బంది వచ్చిన పరిశీలన చేసి ఆస్తినష్టాన్ని అంచనా వేశారు.

ముగిసిన షిర్డీసాయి మందిర వార్షికోత్సవం

216 కలశాలతో బాబాకు క్షీరాభిషేకం



ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు శాతవాహన నగర్‌లోని షిర్డీసాయిబాబా మందిర 19వ వార్షికోత్సవ ముగింపు వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. ప్రధానార్చకుడు ఇరగవరపు వెంకట శ్రీధర స్వామి శిష్య బృందం ఆధ్వర్యంలో సాయినాథుడికి 216 కలశాలతో సుమారు వెయ్యి లీటర్ల పాలతో భక్తుల చేతుల మీదుగా సామూహిక అభిషేకం నిర్వహించారు. సాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించి వేకువజాము నుంచే విశేష పూజలు, పంచామృతాభిషేకాలు, సహస్రనామార్చన, మహా పూర్ణాహుతి, నీరాజన మంత్ర పుష్పం, విశిష్ట హోమాలను భక్తిశ్రద్ధలతో జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనకు వేలాదిగా భక్తజనం తరలివచ్చారు. అనంతరం సాయినాథుడికి ప్రసాదంగా పెట్టిన 10 కేజీల లడ్డూను కాట్రగడ్డ దుర్గాప్రసాద్ అనే భక్తుడు రూ.85 వేలకు దక్కించుకున్నాడు. ముగింపు వేడుకల్లో దత్తసాయి మందిర కమిటీ ప్రతినిధులు బండ్రెడ్డి శేషగిరిరావు, కాట్రగడ్డ దుర్గాప్రసాద్, మేకా శ్రీనివాసరావు, పి.ధనుంజయ రెడ్డి, వేములపల్లి రామచంద్రరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సమాజంలో సనాతన ధర్మానికి ప్రాధాన్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రామకృష్ణ మిషన్ ఆశ్రమ స్వామీ విధేయనందాజీ మహారాజ్

అగనంపూడి: హైందవ సమాజంలో సనాతన ధర్మానికి, ఆచారాలకు విశిష్టమైన ప్రాధాన్యత ఉందని, అవి నేటికీ వర్ధిల్లుతున్నాయంటే వాటి గొప్పదనాన్ని గ్రహించాలని రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి శ్వాసం విధేయనందాజీ మహారాజ్ అన్నారు. జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి సమీపంలోని గొన్నా విద్యా సంస్థల ఆవరణలో సనాతన ధర్మంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మనిషి దైనందిన జీవనంలో సనాతన ధర్మానికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. సనాతన ధర్మం వల్ల సమాజం ఒక క్రమ పద్ధతిలో నడుస్తుందని, చట్టాలు, శాసనాలు లేని రోజుల్లో కేవలం ఈ ధర్మంపైనే సమాజం ఆధారపడి మనుగడ సాగించిందన్నారు. స్వీయ ఎదుగుదల, నియంత్రణకు ధర్మం దిక్సూచిలా పనిచేస్తుందన్నారు. మనిషి నమ్మకాలు, ఆచారాలు, విశ్వాసాలు సనాతన ధర్మంపైనే ఆధారపడి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పీఎస్ఎస్ మూర్తి, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

సందేశాత్మక చిత్రం 'సిద్ధార్థ్ రాయ్'

- హీరో దీపక్ సరోజ్



మీడియాతో మాట్లాడుతున్న హీరో దీపక్ సరోజ్, హీరోయిన్ తన్వి, కీర్తన

అల్లిపురం: యదార్థ సంఘటన ఆధారంగా యువతకు సందేశం ఇచ్చే చిత్రంగా సిద్ధార్థ్ రాయ్ నిర్మించినట్టు ఆ చిత్రం హీరో దీపక్ సరోజ్ అన్నారు. ఈ చిత్రం తన కెరీర్‌లో బెస్ట్‌గా నిలుస్తుందన్నారు. ఈ నెల 23న ప్రపంచ వ్యాప్తంగా విడుదల అవుతుందన్నారు. చిత్రం ప్రమోషన్‌లో భాగంగా యూనిట్ సభ్యులు నగరంలో ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బెంగాల్‌లో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా యశస్వి దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కించినట్లు తెలిపారు. ఎటువంటి ఎమోషన్స్ లేకుండా తిండి, నిద్ర, రొమాన్స్ మాత్రమే కావాలనుకునే యువకుడు ప్రేమకు ఎలా లొంగిపోయాడు అనేది సిద్ధార్థ్‌రాయ్ చిత్ర కథన్నారు. లాజికల్ నుంచి ఎమోషన్‌కు మారే సిద్ధార్థ్ క్యారెక్టర్ ప్రతి ఒక్కరికి కనెక్ట్ అవుతుందన్నారు. నిర్మాత ఫణి ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా తీశారన్నారు. హీరోయిన్ తన్వి మాట్లాడుతూ ఈ చిత్రంలో ఇందు క్యారెక్టరు చేశానని, ఎంతో ధైర్యవంతమైన యువతిగా కనిపిస్తానన్నారు. మరో నటి కీర్తన మాట్లాడుతూ చిత్రంలో కీర్తి క్యారెక్టర్ మంచి పేరు తీసుకొస్తుందన్నారు.

ప్రాజెక్టుల నిర్వహణకు ఆహ్వానం



విజయ్ భావరాజును సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వ విద్యాలయంతో సంయుక్తంగా పరిశోధన ప్రాజెక్టులు చేపట్టాలని అమెరికాకు చెందిన ఈటాస్ రీసెర్చి ల్యాబ్ సీనియర్ ప్రిన్సిపాల్ ఇంజినీర్ డాక్టర్ విజయ్ భావరాజుని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి స్వాగతించారు. శనివారం ఏయూను సందర్శించిన డాక్టర్ విజయ్‌తో వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి కార్యాలయంలో భేటీ అయ్యారు. క్రిటికల్ టెక్నాలజీస్, ఏయూ నిర్వహిస్తున్న పలు స్టార్టప్‌లకు తాను మార్గదర్శకం వహిస్తానని డాక్టర్ విజయ్ సంసిద్ధత వ్యక్తం చేశారు. అనంతరం ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థులనుద్దేశించి చాలెంజెస్ ఇన్ మోడరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ ఇన్ ద ఎమర్జింగ్ క్లైమేట్ ఇష్యూస్ అనే అంశంపై ప్రసంగించారు. విభాగ ఆచార్యులు పరిశోధన రంగంలో జరుగుతున్న నూతన ఆవిష్కరణపై చర్చించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య పి.మల్లికార్జునరావు, బీవోఎస్ చైర్‌పర్సన్ ఆచార్య కె.రమాసుధ తదితరులు పాల్గొన్నారు.